# మిసెస్ కైలాసం

అనగనగా ఓ నగరం. ఆ నగరం పేరు భాగ్యనగర్. భాగ్యనగర్ భాగ్యమా అని ఓ ఆఫీసరమ్మ మదరాసు నగరంనుంచి తరలివచ్చింది భాగ్యనగర్‌కు. భాగ్యనగర్‌లో ఉండటానికి చాలామంది ఆడ ఆఫీసర్లు వున్నారు. ఆమెలాంటి ఆఫీసరు ఆమె ఒక్కర్తె ఆమె దృష్టిలో. ఆఫీసరు అంటే అల్లాటప్పా ఆఫీసరుకాదు, గజెటెడ్ ఆఫీసరు. ఆమె గజెటెడ్ ఆఫీసరు ఏ క్షణాన అయిందో ఆ క్షణంనుంచే ఆమెకు కష్టాలు పుంఖానుపుంఖాలుగా చుట్టివేశాయి.

ఆమె ఉద్యోగంలో చేరిన చాలాకాలానికి కాని- అదీ నానా గడ్డీ కరచి- గజెటెడ్ ఆఫీసరు కాలేదు. తను చేరింది చిన్న ఉద్యోగమే అయినా తనలో గజెటెడ్ ఆఫీసరుకు వుండాల్సిన గుణాలు వున్నాయని మొదటే గుర్తించింది. తన యోగ్యతను గుర్తించుకొన్న మరుక్షణంనుంచే మనశ్శాంతికి దూరం అయింది. తను చిన్న ఉద్యోగం చెయ్యటానికి కారణం తనలోని సేవా తత్పరతే అనుకుంటూ బాధపడుతున్న మనస్సును జోకొట్టి నిద్రపుచ్చటానికి ప్రయత్నించేది మిసెస్ కైలాసం.

ఆమె దృష్టిలో తన యోగ్యతను గుర్తించని అధికారులు అజ్ఞానులు. ప్రభుత్వం గుడ్డిది. అసలు తనలాటి వ్యక్తి ఈ దేశంలో జన్మించటమే తన దౌర్భాగ్యం అని అప్పుడప్పుడూ వాపోతూ వుండేది మిసెస్ కైలాసం, గజిటెడ్ ఆఫీసరు కాకముందు.

ఆమె పేరులో విలక్షణత వుంది. ఆమె ప్రతి పనిలోనూ, మాటలోనూ, కదలికలోనూ విలక్షణత ఉట్టిపడుతూ వుంటుంది. ఒకసారి ఆమెను చూసినవారికీ, ఒకసారి ఆమె మాట్లాడగా విన్నవారికీ ఆమెను గురించి చాలా గొప్ప అభిప్రాయమే కలుగుతుంది. చక్కగా మాట్లాడగలదు. అవినీతి నిర్మూలన గురించీ, జీవితాదర్శాల గురించీ 6 గంటలయినా అనర్గళంగా మాట్లాడగలదు. ఆమె చెప్పే నీతులూ, ఆదర్శాలూ లోకం కోసమే. ఆమె దృష్టిలో తను వాటన్నింటికీ అతీతురాలు. ఆ మాటకొస్తే, తనే ఒక గీటురాయి ఆదర్శానికీ, నీతికీ అని ఆమె గాఢమైన అభిప్రాయం.

మిసెస్ కైలాసానికి తనమీద తనకు వల్లమాలిన అభిమానమూ, గౌరవమూ. పొరపాటునకూడా తనపేరు పక్కన 'గారు' అన్న పదాన్ని తగిలించుకోవడం మర్చిపోదు. గాఢనిద్రలోనుంచి తట్టిలేపి “మీ పేరేమిటండీ” అని అడిగితే తడుముకోకుండా 'మిసెస్ కైలాసంగారు' అనేస్తుంది.

ఆర్థిక పరిస్థితులకు తలవంచి, చిన్న ఉద్యోగం చెయ్యక తప్పలేదు. తను ఏ

ఉద్యోగంలో వుంటేనేమిటి? తను తనే. ఆ చిన్న ఉద్యోగంలో వున్న తనను తనుగా ప్రపంచానికి చూపించుకోవటానికి పడరానిపాట్లూ పడ్డది. అంత పెద్ద వ్యక్తిత్వం అంత చిన్న ఉద్యోగంలో పట్టక యెలా ఉక్కిరిబిక్కిరి అయిపోతుందో అనే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురావటానికి ప్రతి నిముషం ప్రయత్నిస్తూనే వుండేది. ఈ ప్రయత్నంలో ఎంతమంది అఫీసర్లను ఎన్ని రకాల సంతోషపెట్టటానికి ప్రయత్నించిందో ఆమెకే ఎరుక.

ఆమెకు ఆడవాళ్ళంటే (తన్ను చాలా గొప్పదిగా గుర్తించేవాళ్ళను తప్పించి) ముఖ్యంగా అందంగా వుండి కలుపుగోలుతనంగా వుండేవాళ్ళంటే మహారోత. వాళ్ళను చూస్తుంటే ఆమెకు యీ ప్రపంచంనుంచి దూరంగా ఎక్కడికో పారిపోవాలనిపించేది. మగవాళ్ళంటే- ముఖ్యంగా పెద్దపెద్ద ఉద్యోగాల్లో వుండే మగవాళ్ళంటే వళ్ళుమండిపోయేది. ఆ మంటల వేడిమికి తాళలేక అప్పుడప్పుడు 'వాళ్ళ అవినీతి చర్యలను గురించి ఎలుగెత్తి ఆక్రోశించేది.' తనకు తెలిసిన ఆఫీసర్లంటేనూ, తనకు సహాయం చేసిన ఆఫీసర్లంటేనూ చాలా చాలా అభిమానం ఆమెకు. తనను గౌరవించే ఆఫీసర్లను వదలివేయగా మిగిలిన మగ ఆఫీసర్లలో "నీతి, న్యాయం" అనేవి కాగడా వేసి వెతికినా కనబడవని ఆమె ఖచ్చితమైన అభిప్రాయం.

ఏ ఏ ఆఫీసర్ల కార్ల నెంబర్లు ఏమిటో, ఏ ఏ కారులో, ఏ ఏ రోజు, ఏ ఏ అమ్మాయి ఎక్కి తిరిగిందో మిసెస్ కైలాసం చెప్పగలదు.

ఆఫీసర్ల అవినీతి కథలు చెబుతున్నప్పుడు ఆమె గుండెలో సుడిగుండాలు తిరుగుతాయి. ఆ సుడిగుండాల తాలూకు సంచలనం ఆమె కళ్ళలో కనిపిస్తుంది.

అందం అనేదానికి ఆమె శరీరంలో ఆశ్రయం లభించని మిసెస్ కైలాసం జీవితయాత్రలో ఏభయ్యో మైలురాయికి దగ్గర దగ్గరగా వుంది.

మిస్టర్ కైలాసం ఏమయ్యాడో చాలా తక్కువమందికి మాత్రమే తెలుసు. తెలిసిన వాళ్లు ఏవేవో కథలు చెబుతూనే వుంటారు.

ఆమెకు మగ ఆఫీసర్ల దగ్గర పనిచెయ్యటమంటే చచ్చేంతటి భయం. కాని తనకు మగవాళ్ళ దగ్గర పని చెయ్యటం "అవమానం" అని చెబుతూ వుంటుంది. మగ ఆఫీసర్లు యోగ్యతను గుర్తించరనీ, కేవలం అందంగల ఆడవాళ్ళనే అభిమానిస్తారనీ ఆమె భయం. తనకు మగ ఆఫీసరు దగ్గర పని చెయ్యాల్సి వచ్చిన మరుక్షణంలోనే రాజీనామా యిచ్చేస్తాను అంటూ ఉండేది.

మిసెస్ కైలాసం ఎదురుచూసిన మరుక్షణం రానేవచ్చింది. అలాంటి క్షణం ప్రభుత్వ ఉద్యోగాల్లోవున్న ఎంతమందికి వస్తుంది కనుక? మిసెస్ కైలాసం గజెటెడ్ ఆఫీసరు అయింది! ఆ వార్త వినగానే క్షణంలో సగంసేపు ఆమెకు గుండె ఆగిపోయినట్లనిపించింది. ఎలాగో ఆఫీసరమ్మగారి గదికి చేరుకుని అంత శరీరాన్ని కుర్చీలో పడేసింది. చిరునవ్వుతో ఆఫీసరమ్మ మిసెస్ కైలాసానికి ఆర్డరు కాగితం అందించింది. అందుకుంటున్న మిసెస్ కైలాసం చేతివేళ్ళు వణికాయి. మనస్సు ఏదో ఏదోగా అయిపోయింది. అరంగుళం పాముమందుకు నిప్పంటించినట్లు, ఏదో భావం ఆమె హృదయంలో బుసబుసలాడుతూ పైకి లేచి, బయటపడేమార్గం దొరకక వంగి, మెలికలు చుట్టుకుపోసాగింది. తన శరీరంలోని ప్రతి జీవాణువూ 'ఇంతింతై వటుడింతై'నట్లు పెరిగిపోతున్నట్లనిపించింది. అసలే పొడవైన తను యింకా యింకా చాలా పొడవుగా, ఎత్తుగా పెరిగిపోయినట్టనిపించింది మిసెస్

కైలాసానికి. ఎలాగో తన మూర్ఛ తాను తెలుపుకొన్నదై ఆఫీసరమ్మకు కృతజ్ఞతలు తెలుపుకుంది. బయటకు వస్తున్న మిసెస్ కైలాసానికి కాళ్లు నేలకు ఆననట్లూ, కళ్లు పైకి చూస్తున్నట్లూ అనిపించి సరిగా నడవలేక నడిచింది.

తనకోసం ప్రత్యేకంగా యేర్పాటయిన గదిలో కాలుపెడుతున్న మిసెస్ కైలాసానికి ఎవరెస్టు శిఖరంమీద కాలుపెడుతున్నట్లనిపించింది. గదిలో అడుగుపెడుతూనే అశ్చర్యంతో ఆగిపోయింది. ఇంత పెద్ద గది తనకోసమే? తన ఒక్కదానికోసమే? అవును, తనకోసమే! ఇంకా సందేహం ఎందుకు? గదిలో సగభాగాన్ని ఆక్రమించుకొని, పాతకాలపు పందిరిమంచంలావున్న ఆ పెద్ద టేబులుకూడా తనకోసమే! టేబుల్‌మీద బెల్‌కూడా వుంది. ఆ బెల్‌మీద పొరపాటున చెయ్యిపడ్డా పరుగెత్తుకొచ్చి తన ముందు వినయంగా నిల్చొనే ప్యూన్-ఇవన్నీ తనకోసమే! ఆమెకు మతిపోయినట్లయింది. ఏదో మత్తు ఆమె శరీరాన్నీ, మెదడునూ కప్పివేస్తున్నట్లుంది. ఏమిటబ్బా! తనకు అదోలా తమాషాగా వుంది అనుకుంటూ వెళ్ళి తనకోసం ప్రత్యేకించబడిన కుర్చీమీద కూర్చుంది. కూర్చుంటూనే కుర్చీ గిర్రున తిరిగినట్టయింది. దాంతోపాటు మిసెస్ కైలాసానికి బుర్రకూడా గిర్రున తిరిగినట్లయింది. ఆమెకు ఆ క్షణంలో అర్థం కాలేదు. తనకు బుర్ర తిరుగుతున్నట్లుండటానికి కారణం-తనను చుట్టివేస్తున్న మత్తేననీ, ఆ మత్తు ప్రపంచంలోని అన్ని మత్తులకంటే ఘాటైన మత్తనీ, దానికి విరుగుడు లేదనీ, అది అధికారం మత్తు అనీ.

మత్తులో దిమ్ముగావున్న మిసెస్ కైలాసం బుర్రలో మెరుపులా ఓ ఆలోచన తళుక్కుమంది. ఇప్పుడు తను అందరిలాంటి మనిషి కాదు. ఇప్పుడు తను మందలో మనిషికాదు. అదే మాబ్ అంటే మంద, గొర్రెలమందలో ఒక గొర్రెకాదు. తను తోడేలు-ఛ తోడేలుకాదు. మరి... మరి...! తనేమిటో తనకే తెలియటంలేదు. తను మందలో మనిషికాదు. పదిమందిలో మనిషి. అసలు ఆమాటకొస్తే తను ఎప్పుడు మాత్రం మంద - అదే- మాబ్ మనిషి? కాకపోతే చిన్న ఉద్యోగంలో వున్నందువల్ల మూర్ఖులు గుర్తించలేదు- అంతే.

మిసెస్ కైలాసం ఆఫీసరు అయిన మరుక్షణంనుంచి తను చాలా ఎత్తుగా పెరిగినట్లు వూహించుకుంది. అంతవరకు చిక్కులేదు. కాకపోతే ఆమెలో వచ్చిన ఆ మార్పును ప్రపంచం కూడా గుర్తించాలని ఆశించింది. తన చుట్టూవున్న ప్రపంచంలోకూడా మార్పును ఆశించింది. వచ్చిన చిక్కల్లా ఇక్కడే.

మిసెస్ కైలాసం ఆ రాత్రంతా కలతనిద్రలోనే గడిపింది. నిద్రమంచంమీద లేచి కూర్చొన్న మిసెస్ కైలాసానికి ఆ ఇల్లూ, ఆ ఉదయమూ, ఆ వాతావరణమూ అంతా మామూలుగానే వుండటం నిరుత్సాహాన్ని కలిగించింది. పైగా పనిమనిషికూడా మామూలుగానే తన పని తను చేసుకొంటూ వుండటం చిరాకెత్తుకొచ్చింది. కారణం లేకుండా పనిమనిషిమీద విరుచుకుపడింది. అర్థంగాని పనిమనిషి మౌనంగా తన పనిలో మునిగిపోయింది.

'ఎంత నిర్లక్ష్యం!' గొణుక్కుంది మిసెస్ కైలాసం-అంతకంటే ఏమనాలో తోచక.

ఆఫీసుకు బయలుదేరిన మిసెస్ కైలాసానికి బస్‌స్టాండువరకూ రోజూలాగే-ఎన్.జీ.ఓ.లాగే నడిచిరావాలంటే చచ్చేంత సిగ్గు వేసింది. తను గజెటెడ్ ఆఫీసరయాక కూడా ఎన్.జీ.ఓ.లతోపాటు మాబ్‌లో మనిషిలా... అదే మందలో గొర్రెలా నడవాల్సిందేనా?

ప్రభుత్వంమీద, ఈ దేశంమీద మిసెస్ కైలాసానికి ఎక్కడలేని కోపం వచ్చింది. గజెటెడ్ ఆఫీసర్ని చెయ్యగానే సరిపోయిందా? ఆ ఆఫీసరు హోదాను, గౌరవాన్నీ నిలబెట్టటం ప్రభుత్వ బాధ్యతకాదూ? ఒక కారా పాడా? కనీసం టాక్సీని ఉపయోగించుకొనే ప్రొవిజన్ అన్నా చెయ్యనక్కర్లా? హోదాను పెంచగానే సరిపోయిందా? ఆ హోదాను నిలబెట్టే వసతులైనా చెయ్యాలి, లేక జీతం అయినా పెంచాలి. తనకు కొండంత హోదా పెరిగింది. కాని లాభం? జీతంలో ఓ నూటపాతిక మాత్రమే అదనంగా పెరిగింది. దాంతో హోదాను నిలబెట్టుకొనే జీవితాన్ని గడపటం సాధ్యపడే పనేనా? ఎన్.జీ.ఓ. గడిపిన జీవితానికీ, జీ.ఓ.గా గడపబోయే జీవితానికీ అట్టే తేడా వుండదు. అవ్వ! ఎంత అవమానం? ఏం గజిటెడ్ ఉద్యోగమో? ఇదే యే ఇంగ్లాండులోనో ఐతేనా! అసలు బ్రిటిష్‌వాళ్ళు మన దేశంలో వున్నప్పుడు మాత్రం? గజెటెడ్ ఆఫీసర్లు యెంతో వైభోగంగా వుండేవాళ్లు ఆ రోజుల్లో.

ఆలోచిస్తూ నడుస్తున్న మిసెస్ కైలాసానికి కొందరు తెలిసినవాళ్ళు ఎదురయ్యారు. కాని వాళ్ళల్లో ఎవరూ తనలో పెరిగిన ఎత్తునూ, విశిష్టతనూ గుర్తించినట్లు కనిపించలేదు ఆమెకు. రోజూ పలకరించినట్లే పలకరించి వెళ్ళిపోవటం ఆమెకు నిరాశనే కలిగించింది. వెధవ ప్రపంచం! కుళ్ళు ప్రపంచం! మరొకరి గొప్పను  గుర్తించలేని ప్రపంచం! కక్షగా పైపళ్ళతో కింది పెదవిని కొరుక్కుంది.

ఎలాగో బస్‌స్టాండు చేరింది. బస్‌స్టాండులో అందరితోపాటు, అదే మందలో గొర్రెలా నిల్చోవాలంటే సిగ్గువేసింది. అందరికీ దూరంగా వెళ్ళి నిల్చుంది తను-ఈ మందకు సంబంధించిన వ్యక్తి కాదు అని తెలియజేయాలనే ఆదుర్దాతో, తెలిసినవాళ్ళు విష్‌చేస్తే జవాబుగా, గంభీరంగా ఆఫీసరులా నవ్వటానికి ప్రయత్నించింది. అప్పటికీ తనలోని మార్పును గుర్తించని మూర్ఖుల్ని 'ఏంచేసినా పాపంలేదు' అనుకుంది.

ఎలాగయితేనేం మిసెస్ కైలాసం బస్సు ఎక్కింది. అంత శరీరాన్ని ఇద్దరు పిల్లల మధ్యన బలవంతాన కూలేసింది. అందులో ఒక పిల్ల తనమీదకు వాలిన బరువును భరించలేక, మోయలేని పుస్తకాలతో లేచి నిల్చుంది. ఆ పిల్ల నిల్చోవటానికీ, తను కూర్చోవటానికీ ఎలాటి సంబంధమూ లేనట్లు కూర్చుంది మిసెస్ కైలాసం.

అదే సీటులో చివరగా కూర్చున్న జానకిమీద వాలాయి మిసెస్ కైలాసం చూపులు. ఎంత పొగరు? తనకింద ఆఫీసులో పనిచేసే యీ జానకి కూడా రోజు అలాగే తనను చూస్తుందా? కనీసం తను ఆవిడవైపు చూసినప్పుడన్నా, బస్సుకాబట్టి లేవకపోయినా, లేవటానికి ప్రయత్నిస్తూ వినయంగా నమస్కరించక్కర్లా? ఎంత నిర్లక్ష్యం? మిసెస్ కైలాసానికి జానకిని చెప్పుతో కొట్టాలనిపించింది. చీమలమర్రికి కట్టాలనిపించింది.

పెద్ద చదువులే చదవొచ్చు. తనతో సమానమైన డిగ్రీ ఉండొచ్చు. అయితే మాత్రం తనతో సమానం అనుకోవడం యెంత సాహసం? ఆ తెల్లవాళ్ళ ప్రభుత్వం అయితేనా? జానకిలాటి పొగరుబోతుల్ని ఉద్యోగంనుంచి పీకెయ్యటానికి రెండు నిమిషాలు పట్టేదికాదు. అసలు ఆ డిసిప్లినే వేరు? ఇప్పుడో- రామ! రామ! మాట్లాడితే ఎన్.జీ.ఓలు హక్కంటూ సమ్మెలుకూడా సాగించారు.

ఆఫీసరు "వెధవా" అని సబార్డునేట్‌ను అంటే-వెధవలా ముఖం పెట్టాలి. అంతేకాని తను వెధవనుకాదు అని నిరూపించుకోవటానికి ప్రయత్నించటం ఎంత సాహసం?

తనుకూడా ఎన్నిసార్లు ఆఫీసర్లముందు ఫూల్‌లా ముఖంపెట్టి వాళ్ళను సంతోషపెట్టలేదు? కాని జానకి? వేలెడంత వుందో లేదో, చేసేది ఎల్.డి. గుమాస్తా ఉద్యోగం–పైగా తను చెయ్యని తప్పును ఆఫీసర్లముందు చస్తే ఒప్పుకోదే! జానకిని గురించి ఆలోచించిన మిసెస్ కైలాసంలో కోపం నీళ్ళలో వేసిన సోడాలా పొంగసాగింది.

"ఏమమ్మోయ్, టికెట్!" అప్పటికి ఎన్నిసార్లు అడిగాడో ఏమో కోపంగా, గట్టిగా అడిగాడు కండక్టరు.

ఆలోచనల్లో మునిగివున్న మిసెస్ కైలాసం ఉలిక్కిపడింది. తను ఉలిక్కిపడటం జానకి చూసిందో ఏమోనని అటుకేసి చూసింది. జానకి ముసిముసిగా నవ్వుకుంటూంది. మిసెస్ కైలాసం గుండెల్లో కోపం సుడులు తిరిగింది. కండక్టర్ను కొరకొర చూసింది– అంతకంటే యేమీ చెయ్యలేక.

"టికెట్ అడుగుతుంటే అలా చూస్తావేంటమ్మా?" కండక్టరు చిరాగ్గా అన్నాడు.

'మర్యాద తెలియని బ్రూట్స్' మనసులోనే అనుకొని ఎడమచేతి మునివ్రేళ్ళతో పదిపైసలు బిళ్ళను అందించింది. ముఖం మరోవైపుకు తిప్పుకుంది.

"ఎక్కడకు?"

"లడ్ కీ కా పూల్" ముఖం తిప్పకుండానే విసురుగా అంది– "లకడీ కా పూల్" అనబోయి కోపంతో.

కండక్టరు కిసుక్కున నవ్వి టికెట్ చేతిలో పెట్టాడు.

"మర్యాదగా ప్రవర్తించు!" మిసెస్ కైలాసం గర్జించింది.

అర్థంకాని కండక్టరు తెల్లముఖం వేశాడు.

దగ్గరలో కూర్చున్న ప్రయాణీకులంతా ఇద్దరివైపూ చూడసాగారు ఆశ్చర్యంగా.

"ఏందమ్మోయ్, మర్యాద గిర్యాద అంటున్నావ్?" ఆశ్చర్యంనుండి కోలుకుంటూ అన్నాడు కండక్టర్.

"నే నెవరనుకున్నావ్?"

"నువ్వెవరవయితే నాకేం?" మిసెస్ కైలాసం మాట పూర్తి కాకుండానే అన్నాడు కండక్టర్ కూడా వాల్యూం పెంచుతూ.

"నేను తల్చుకుంటే రేపీపాటికి నీ ఉద్యోగం పీకించేయగల్ను. జాగ్రత్త!" రెచ్చిపోయి అంది మిసెస్ కైలాసం.

"నీలాంటి వాళ్ళను చాలామందిని చూశాను" అన్నాడు కండక్టరు.

"ఏం జరిగిందమ్మా?" పక్కసీటులో కూర్చొనివున్న ఓ వయసు మళ్ళిన పెద్దమనిషి ప్రశ్నించాడు.

"టికెట్ చేతిలో పెడుతూ కావాలనే అంటుకున్నాడు. గజెటెడ్ ఆఫీసర్ని, నాతోనే ఇలా ప్రవర్తించేవాడు, పాపం, చిన్న ఉద్యోగాలు చేసుకొనే మామూలు ఆడపిల్లలతో ఎలా ప్రవర్తిస్తాడో మీరే ఆలోచించండి!" తను గజెటెడ్ ఆఫీసరని బస్‌వాళ్ళందరికీ తెలియజెప్పే అవకాశం లభించినందుకు అంత అవమానంలోను సంతృప్తి కలిగింది. కాని ఆమెకు లభించిన ఆ కాస్త ఆనందాన్ని కూడా ఈ పాపిష్టిలోకం ఎక్కువసేపు దక్కనివ్వలేదు.

"ఎవరు గజెటెడ్ ఆఫీసరో, ఎవరు కాదో వాళ్ళకెలా తెలుస్తుందమ్మా?" అన్నాడు

మొదటి పెద్దమనిషి, వచ్చే నవ్వును ఆపుకుంటూ. ఆయన చాలా పెద్ద ఉద్యోగమే చేసి ఈ మధ్యనే రిటైర్ అయ్యాడు.

"ఎద్దును-ఆబోతును చెయ్యటానికి కాల్చి వాత వేస్తారు. అలాగే నాన్ గజెటెడ్, గజెటెడ్ కాగానే ముఖంమీద ఏదైనా ముద్రను వేసే పద్ధతిని అమల్లో పెడితే బాగుంటుంది!" అన్నాడు డబల్ ఎం.ఏ. చదివి ఎల్.డి. గుమాస్తా ఉద్యోగం చేస్తున్న ఓ యువకుడు వళ్ళుమండి.

అందరూ ఘొల్లున నవ్వారు. మిసెస్ కైలాసం పని అర్ధనగ్నంగా నడిబజారులో నిల్చున్నట్లయింది.

"లేకపోతే ఏంటమ్మా! మా అమ్మకున్న వయస్సుంది, నీ చెయ్యి నేను పట్టి లాగినట్లు మాట్లాడుతున్నావు?" అన్నాడు ప్రయాణీకుల అండ చూసుకున్న కండక్టరు.

"షటప్!"

"జాగ్రత్త, మళ్ళీ అంటాను."

ఆ వయస్సు మళ్ళిన ఆయనే మళ్ళీ కలగజేసుకొని కండక్టర్ని మందలించాడు. కండక్టరు కిక్కురుమనకుండా టికెట్లు ఇష్యూ చేసుకోసాగాడు.

మిసెస్ కైలాసానికి తను కూర్చున్న బస్సే తనను మోసం చేసినట్లు అనిపించింది. జానకి ఆ బస్‌లోనే వుందని గుర్తురాగానే గుండెలోని మంటను ఎగదోసినట్లయింది. వద్దనుకుంటూనే జానకివైపు చూసింది.

"నవ్వొస్తుందీ నవ్వు! పద ఆఫీసుకు, నీ పని పడతాను!" అనుకొంది మిసెస్ కైలాసం, బహుశా జానక్కి నవ్వు వస్తూ వుంటుందని ఊహించుకొని. జానకి కొరకరాని కొయ్య. తను ఏం చెయ్యగలదు! భయపడేవాళ్ళను భయపెట్టగలం గాని జానకిలాటి వాళ్ళను ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు? మిసెస్ కైలాసం ఆలోచనలో పడింది.

మొదటిరోజే కష్టాలతో ప్రారంభం అయిన మిసెస్ కైలాసం గజెటెడ్ ఉద్యోగం దినదినగండంగా సాగుతోంది. ఆఫీసులో యే ఇద్దరు మాట్లాడుకున్నా మిసెస్ కైలాసం వాళ్ళు తనను ఆడిపోసుకుంటున్నారనుకొనేది. ఇద్దరు ఎన్.జీ.ఓ.లు ఒకచోట చేరితే ఆఫీసర్లను ఆడిపోసుకోవటం తప్పించి వాళ్ళకు మాట్లాడుకోవటానికి వేరే విషయాలు ఏమీ వుండవని ఆమె గాఢ నమ్మకం. ఆఫీసరమ్మకు, ఎప్పుడూ అఫీసులో వాళ్ళు మాట్లాడుకుంటూ వుంటారనీ, పనిచెయ్యరనీ, చెవిని ఇల్లు కట్టుకొని పోరి చివరకు ఓ ఆఫీసు ఆర్డరు "ఆఫీసులో ఎవరితో ఎవరూ మాట్లాడకూడదు" అని ఇష్యూ చేయించింది. ఆ ఆర్డర్ను ఎంతవరకు పాటిస్తున్నారో తెలుసుకోవటానికి మిసెస్ కైలాసం ప్రతి అర్ధగంటకూ ఓసారి ఆఫీసులోకి జొరబడుతుంది.

(ఆమె ఆఫీసులో చేస్తున్న పనీ, చెయ్యవలసిన పనీ ఏమిటండీ అంటే- ఆమె దృష్టిలో ఆమె ఈ చెత్త డెస్కు వర్క్ చెయ్యటానికి పుట్టలేదు. తప్పదు కాబట్టీ, అసలు ఆర్డరు పాసు చెయ్యవలసింది తనపై ఆఫీసరు కాబట్టీ ఫైల్సులో ఓ సంతకం పారేసి పైకి నెట్టేస్తుంది. ప్యూను ఫైలు తెరిచి పట్టుకుంటే తను వెయ్యాల్సింది పెద్ద సంతకమో, చిన్న సంతకమో అడిగి ఓ సంతకం పారేస్తుంది. ఫెయిర్ కాపీమీద పెట్టేది పెద్దసంతకమనీ, ఆఫీసు కాపీమీద పెట్టేది చిన్నసంతకమనీ అనుభవం మీద తెలుసుకుంది. అప్పటినుంచి వెధవ ప్యూన్‌గాణ్ణి అడగవలసిన అవసరంకూడా తీరిపోయింది.)

మిసెస్ కైలాసం గజెటెడ్ అయిన మరునాటినుంచి ఆఫీసుకు ఓ గంట ఆలస్యంగా వచ్చేది. ఓ గంటముందే బయలుదేరి వెళ్ళిపోయేది. ఎన్.జీ.ఓ.లతోపాటు బస్సులో ప్రయాణం చెయ్యటమే కాకుండా, కరెక్టుగా సమయానికి రావటం ఆమెకు తల కొట్టేసినట్లుండేది.

ఇలావుండగా ఒకనాడు ఏం జరిగిందీ అంటే... ఐదుగంటలకు శీలా, సరస్వతీ, రాజ్యం, జానకీ బస్సుస్టాండుకు వెళ్ళేప్పటికి మిసెస్ కైలాసం అక్కడ నిల్చొని వుంది. వస్తున్న వాళ్ళను చూసి మిసెస్ కైలాసం అశాంతిగా కదలటం, మళ్ళీ అంతలోకే కర్రలా బిగుసుకొని నిల్చోవటం జానకి చురుకైన కళ్ళలో పడింది.

"ఎందుకో అంతబాధ! సుఖంగా బ్రతకలేక?" అనుకుంటూ మిసెస్ కైలాసంవైపు జాలిగా చూసింది జానకి.

ఆఫీసరుగార్ని పలకరించకపోతే బాగుండదని వినయంగా నమస్కరించింది. ఎప్పుడూ మంచిపేరుకోసం తాపత్రయపడుతూ వుండే రాజ్యం ఆమెకు దగ్గరగా వెళ్ళి నమస్కారానికి జవాబుగా ఓ చిరునవ్వును విసరింది.

"మీరు ఈ మధ్య బస్సుస్టాండులో కనిపించటంలేదు. ఆలస్యంగా వెళ్ళుతున్నారా?" ప్రశ్నించింది మాటకు మాటకు ముందు ప్లీజింగ్‌గా నవ్వే అలవాటు వున్న శీల.

"ఆలస్యంగా కాదు. ఓ గంటముందే వెళ్ళిపోతున్నాను. డైరెక్టరుగారి పర్మిషన్ తీసుకున్నాను." సగర్వంగా అంది మిసెస్ కైలాసం వంగి శీల ముఖంలోకి ముఖంపెట్టి అదోలా నవ్వుతూ.

"రోజూ గంట ముందే వెళ్ళిపోతున్నారా? ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగింది జానకి. జానకి స్వరం వినగానే పాము పడగ విప్పినట్లే తమాషాగా ముఖాన్ని జానకివైపు తిప్పింది.

"ఎందుకేమిటి? ఐదయితే బస్సులు దొరకటం చాలా కష్టంగా వుంది. బస్సుస్టాండులో గంటలకొద్దీ ఎన్.జీ.ఓ.లతోపాటు "టీ" తాగుతూ, వేరుశనగపప్పులు తింటూ నేనెలా నిల్చోగలను?" ఈ దెబ్బతో జానకి అహంకారం చచ్చిందే అన్నట్లు విజయగర్వంగా చూసింది మిసెస్ కైలాసం.

రాజ్యం ముఖం మాడిపోయింది. శీల ముఖంలోకి చూసింది. ఏడవలేక నవ్వుతుంది శీల. జానకివైపు చూసింది రాజ్యం. జానకి పెదవులమీద లాస్యం చేస్తున్న చిరునవ్వును చూసి ఆశ్చర్యపోయింది రాజ్యం. జానకి ముఖం మాడ్చుకోకపోవటం మిసెస్ కైలాసానికి కొంత నిరాశనే కలిగించింది.

జానకి రెండడుగులు ముందుకు వేసింది. "ఏమిటంట?" అన్నట్లు చూసింది మిసెస్ కైలాసం.

"క్షమించండి! మొన్నటిదాకా మీరు ఎన్.జీ.ఓ.యే గదా? ఆహాఁ– నాకు తెలియక అడుగుతున్నాను. మీరు బస్సుస్టాండుల్లో నిల్చొని "టీ" తాగుతూ, వేరుశెనగకాయలు తింటూ నిల్చునేవారా అండీ? మేము ఎప్పుడూ అలా చెయ్యలేదులెండి. అందుకే తెలియక అడుగుతున్నాను" అంది జానకి వ్యంగ్యంగా.

మిసెస్ కైలాసానికి మాటలే కరువయ్యాయి. అసలే చిన్నదయిన మిసెస్ కైలాసం ముఖం ముడుచుకొని చింతాకంత అయింది. అసలే పొడుగాటి కాళ్ళేమో, గబగబా

రెండంగల్లో వెళ్ళి రోడ్డుపక్కగా వున్న రిక్షా ఎక్కి కూర్చుంది, బేరంకూడా అడక్కుండా. ఆ తరవాత రిక్షావాడితో పడే పేచీ ఆ పక్కింటివాళ్ళ నడిగితే తెలుస్తుందేమో!

"మీకు చాలా ధైర్యం బాబూ!" అంది రాజ్యం- జానకి ధైర్యాన్ని మెచ్చుకోవటానికి బదులుగా నొచ్చుకుంటున్నట్లు. రాజ్యానికి తనకు లేదనే బాధకంటే ఇతర్లకు వున్నదనే బాధ ఎక్కువ.

"నిజం మాట్లాట్టానికి భయం ఎందుకు? మనల్ని ఇంతమందిని అవమానించే అధికారం ఆమెకు ఎవరిచ్చారు?" అంది జానకి.

అలా అన్నదే కాని జానకి కళ్ళముందు మిసెస్ కైలాసం చింతాకంత ముఖం కనిపించేప్పటికి జాలి వేసింది. తను అంత మొరటుగా అనాల్సింది కాదేమో!

జానకి అవకాశం చిక్కినప్పుడల్లా భూమిమీద ఆనని మిసెస్ కైలాసం కాళ్ళను పట్టుకొని కిందకులాగి "ఇదీ భూమి. నువ్వు నిల్చోవలసింది ఇక్కడ!" అని చెప్పటానికి ప్రయత్నిస్తూ వుంటుంది. అలా లాగినప్పుడు మిసెస్ కైలాసం కిందకు దిగటమే కాకుండా, అప్పుడప్పుడు బొక్కబోర్లా ముక్కుకు దుమ్మంటేలా పడటంకూడా జరుగుతూ వుంటుంది.

మిసెస్ కైలాసం ఎంతగా మందను తప్పించుకు తిరగాలనుకుంటున్నా అప్పుడప్పుడు ఆఫీసువాళ్ళకు బస్సుస్టాండులో తటస్థపడ్తూనే వుంటుంది.

ఒకరోజు బస్సుస్టాండ్‌లో శీల చేతిలోవున్న ఓ తెలుగు వారపత్రికను అందుకుంది. తెరిచిచూస్తూ "నాకు తెలుగు సాహిత్యం అన్నా, తెలుగు సినీమాలన్నా అసహ్యం. అసలు తెలుగు భాష మాట్టాట్టమంటేనే చిరాకు. ఇంగ్లీషులోవున్న ఎక్స్‌ప్రెషన్ తెలుక్కు ఎక్కడుంది?" అంది. అంతలోనే ఆ దృష్టి పత్రికలోని ఒక కథ పేజీమీద పడింది. మిసెస్ కైలాసం పకపక నవ్వసాగింది. అర్థంకాక శీలా, రాజ్యం, జానకీ ఆమె ముఖంలోకి చూశారు ఆశ్చర్యంగా.

"ఈ తెలుగు వాళ్ళకు కథలకు పేర్లు పెట్టటంకూడా రాదు. 'పాకుడురాళ్ళు' అట. రాళ్లు ఎక్కడన్నా పాకుతాయా?" అంటూ తన చమత్కారానికి తానే మురిసిపోతూ పకపకా విరగబడి నవ్వసాగింది మిసెస్ కైలాసం.

"పాకుడు రాళ్లు పాకవు. కాని ఆ రాళ్ళమీద ఒకసారి కాలువేసి చూడండి- మీరు ఎంతదూరం పాకుతారో తెలుస్తుంది. కనీసం పది గజాలకు తక్కువ కాకుండా పాకిపోతారు- తెలుసా?" అంది వళ్ళు మండిన జానకి.

అందరూ ఘొల్లున నవ్వారు. అంతలోనే మిసెస్ కైలాసం తమ ఆఫీసరని గుర్తురాగానే అందరూ బిగుసుకుపోయారు. మిసెస్ కైలాసం నిలువుగా కర్రలా బిగుసుకు నిల్చుంది దూరంగా జరిగి. జానక్కి ఆమెను చూస్తుంటే మళ్ళీ జాలివేసింది. అంతవరకూ వెలిగిపోతున్న మిసెస్ కైలాసం ముఖంలో ఎవరో స్విచ్ ఆఫ్ చేసినట్లు వెలుగు ఆరిపోయింది.

మిసెస్ కైలాసానికి జానకిని తుమ్మచెట్టుకు కట్టి చింత బరికెతో కొట్టాలనిపించింది.

ఆనాడు బస్సుస్టాండుకు వచ్చిన మిసెస్ కైలాసం చాలా వుత్సాహంగా వుండటాన్ని గమనించింది జానకి. అందరితో చాలా వుత్సాహంగా కబుర్లు చెప్పసాగింది. ఆనాడు జానకితోకూడా ఆప్యాయంగా మాట్లాడసాగింది. మిసెస్ కైలాసం తను 'ఇంగ్లాండులో వుండగా' (నాలుగు నెలలు ఏదో కోర్సు చదివింది) అనే విషయాన్ని గురించి ఉపన్యాసం దంచుతూ వుంది.

ఇంతలో జానకి ఒక కుంటి బిచ్చగాడికి రెండు నయాపైసలు ఇచ్చింది. దాంతో మిసెస్ కైలాసంగారి వాగ్ధోరణి మరోవైపు తిరిగింది.

"మీలాటి వాళ్ళుండబట్టే మనదేశంలో బెగ్గింగ్ నానాటికీ పెరిగిపోతుంది. ఇదే ఇంగ్లాండులో నయితేనా?" అంటూ బిక్షావృత్తిమీద ఐదు నిమిషాలు అనర్గళంగా ఉపన్యాసం దంచింది.

"శారీరకంగా బాగా వున్నవాళ్ళకు భిక్ష పెట్టకూడదు-కాని కుంటివాళ్ళూ, గుడ్డివాళ్ళూ ఎలా బ్రతకాలండీ?" వినయంగానే ప్రశ్నించింది రాజ్యం.

"అసలు వాళ్లు ఎందుకు బ్రతకాలీ అంట? వాళ్ళవల్ల దేశానికి ఏమిటి ఉపయోగం?" నిలదీసి ప్రశ్నించింది మిసెస్ కైలాసం.

"చావు బ్రతుకులు మన చేతుల్లో వున్నాయా? అయినా మనందరం బ్రతికిమాత్రం దేశాన్ని ఉద్ధరిస్తుందేమిటో?" అంది జానకి ఉద్రేకంగా.

ఇంతలో బస్సు వచ్చింది. ఆపళంగా మిసెస్ కైలాసం ఆడా-మగా, బాల-వృద్ధ విచక్షణ లేకుండా బరబరా తోసుకుంటూ వెళ్ళి, బస్సు ఎక్కింది. బస్సు ఎక్కటం, దిగటంలో ఆమెకు ఆమే సాటి. ఈ పాడు మాబ్ (నర) వాసన తనకు గిట్టదన్నట్టు, బస్సుస్టాండులో నిల్చున్నా, రోడ్డువెంట నడుస్తున్నా, బస్సులో కూర్చున్నా ఇంతలావు ముతక కర్చీపు ఒకటి ముక్కుకు అడ్డుపెట్టుకునే వుంటుంది.

ఇలా జరుగుతూ వుండగా, మిసెస్ కైలాసం ఆ ఆఫీసులో గుమస్తా ఉద్యోగం చేస్తున్న రమణి అనే అమ్మాయిని పక్క జిల్లాకు బదిలీ చేయించింది. రమణి శ్రీమంతుల బిడ్డ. అందంగా వుంటుంది. పైగా చక్కగా ముస్తాబయి వస్తుంది. ఉత్సాహంగా పని చేసుకుంటూ అందరితో కలివిడిగా వుంటుంది. రమణి అంటే మిసెస్ కైలాసానికి పరమ అసహ్యం. అలాంటి ఆడపిల్లలు ఆఫీసులో వుంటే మగవాళ్ళెవ్వరూ పనులు చెయ్యరని మిసెస్ కైలాసం అభిప్రాయం. ఆ అమ్మాయి బదిలీ ఆర్డర్సుచూసి తేలిగ్గా నిట్టూర్చింది మిసెస్ కైలాసం. కాని ఆమెకు ఈ ఆనందం ఎంతకాలమో దక్కలేదు. తెల్లవారే మంత్రిగారినుంచి ఫోన్ రావటంవల్ల ఆ ఆర్డరు కాన్సిల్ చెయ్యాల్సివచ్చింది. మిసెస్ కైలాసానికి మూర్ఛవచ్చినంత పనయింది. ఎలాగో తన మూర్ఛ తాను తెలుపుకున్నదై మంత్రిగారికీ ఆ అమ్మాయికీ మధ్య సంబంధాన్ని గురించి తలబద్దలు కొట్టుకోసాగింది. ఆ ఆఫీసులో తనకు తాళం వేసే కొందరిని పిలిపించి, ఆ విషయం మీద చర్చలు సాగించింది. కాని మిసెస్ కైలాసం మనస్సుకు శాంతి లభించలేదు. జానకి కోసం కబురు పంపించింది.

"పిల్చారట?" అంటూ జానకి ఎదురుగావున్న కుర్చీలో కూర్చుంది.

"ఎంత పొగరు? కనీసం కూర్చోమనేదాకయినా నిల్చోవద్దూ- ఆఫీసరుముందు. న్యాయంగా ఆఫీసరు కూర్చోమన్నా కూర్చోవటానికి సందేహించాలి." పైకి అనలేక మనస్సులోనే అనుకుంది మిసెస్ కైలాసం.

"ఎందుకండీ పిల్చారట?" మళ్ళీ అడిగింది జానకి, ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చుని.

"రమణి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్సు కాన్సిల్ అయ్యాయి!" ప్రశ్నార్థకంగా చూస్తూ అంది మిసెస్ కైలాసం.

“విన్నాను ఇప్పుడే.” ముభావంగా అంది జానకి.

“మంత్రిగారు రమణి అంటే అంత శ్రద్ధ తీసుకోవటానికి కారణం ఏమిటంటావు?” కొంచెం ముందుకువంగి కుతూహలంగా ప్రశ్నించింది మిసెస్ కైలాసం.

జానక్కి నవ్వు వచ్చింది. మిసెస్ కైలాసం మాటల్లోని అంతరార్థం తెలుసుకొన్న జానక్కి అసహ్యం వేసింది. మొరటుగా జవాబు చెప్పాలనిపించింది. ‘నాకు తెలియదు’ అని మాత్రమే అనగలిగింది.

జానకి జవాబుకు మిసెస్ కైలాసం అరికాలిమంట నెత్తికెక్కింది.

“ఇలాంటి వాళ్ళంటే నాకు చాలా అసహ్యం. పెద్ద ఆఫీసర్లు ఇచ్చిన ఆర్డర్లను ఒబే చెయ్యాలిగాని ఇలా ఎవరెవరినో పట్టుకొని కాన్సిల్ చేయించుకోవడం మోస్టు ఇండిసిప్లిన్. ఇదే తెల్లవాళ్ళ రాజ్యంలో అయితేనా?”

“ఎవరి కష్టాలు వాళ్ళకుంటాయి. పెళ్ళి కావాల్సిన పిల్ల అంతదూరం ఎలా వెళుతుంది?” సౌమ్యంగానే అంది జానకి.

“గవర్నమెంటు సర్వీసు అంటే ఏమిటనుకున్నావ్?” రెట్టించింది మిసెస్ కైలాసం.

“క్షమించండి! మరి పోయిన సంవత్సరం మీకు ట్రాన్స్ఫర్ వస్తే ప్రభుత్వాన్నీ, భగవంతుణ్ణికూడా దుమ్మెత్తిపోశారుగా! ముఖ్యమంత్రిగారి దగ్గర భోరు భోరున ఏడ్చి ఆర్డర్స్‌కూడా కాన్సిల్ చేయించుకున్నారుగా?” అంది జానకి.

మిసెస్ కైలాసం ముఖం మాడిపోయింది. కుర్చీలో కర్రలా బిగుసుకుని పెగల్చుకొని అంది :

“బలేదానివే! నేనూ రమణి ఒకటేనా యేమిటి?” ఎలాగో గొంతు పెగల్చుకొని అంది.

జానకి లేచి చెప్పకుండానే బయటకు వెళ్ళిపోయింది. అలా వెళ్ళిపోతున్న జానకిని చూసి “అసలు నిన్ను పిలవటం నా బుద్ధి తక్కువేలే” అనుకుంది; పళ్ళు పటపట కొరకబోయి పెదవి కొరుక్కుంది.

అసలే అష్టకష్టాలు అనుభవిస్తున్న మిసెస్ కైలాసానికి ఓ శుభ ముహూర్తాన పిడుగులాటి వార్త నెత్తినపడింది. ప్రస్తుతం వున్న ఆఫీసరమ్మగారి స్థానంలో ఓ మగ ఆఫీసరు వస్తున్నాడని తెలిసింది. ఆ వార్త విన్న మిసెస్ కైలాసం ఆఫీసులో, ఇంట్లో, చివరకు ఊళ్ళోకూడా కాలు కాలిన పిల్లిలా తిరిగింది.

మగ ఆఫీసరే! ఇంకేమయినా వుందా? లోలోపల గుండెలు బాదుకుంది. ఆడపిల్లలు బతకటానికే? అసలే ఆ జానక్కి పట్టపగ్గాలుండవు. రెండు రోజుల్లో ఆ మగ ఆఫీసర్ని వల్లో వేసుకోదా! ఇంకేమైనా వుందా? ఇక తనను లెక్కచేసేవాళ్ళు ఆ ఆఫీసులో వుంటారా? మిసెస్ కైలాసం తనకువున్న పలుకుబడినంతా ఉపయోగించి ఆ మగ ఆఫీసరును రాకుండా చెయ్యటానికి ప్రయత్నించింది.

కాని ఒక దుర్ముహూర్తాన ఆ మగ ఆఫీసరు వచ్చి కూర్చున్నాడు.

ఆఫీసులో పడగవిప్పిన పాములా తిరిగే మిసెస్ కైలాసం ఆఫీసరు గదిలోకి అడుగుపెడుతూనే చెప్పుకింద తేలులా ఇట్టే మారిపోగలదు- కాబట్టి, మిసెస్ కైలాసం వెంటనే మారిపోయింది. వెన్నకంటే మృదువూ, చక్కెరకంటే తియ్యనీ నవ్వును ముఖంమీద పులుముకొని ఆఫీసరుగదిలో కాలు పెట్టింది.

అలా వచ్చిన ఆమెను ఆఫీసరు ప్రశ్నార్థకంగా చూశాడు. తన పరిచయం ఇచ్చుకుంది. వెంటనే ఆయన మర్యాద ఉట్టిపడే స్వరంలో ఆమెను కూర్చోమన్నాడు.

"ఫర్వాలేదు. మంచివాడులాగే వున్నాడు. ఎంత మర్యాద! కాని వయస్సులో మరీ చిన్నవాడిలా వున్నాడు. ఆడపిల్లల వల్లో పడకుండా చూడాలి" అనుకొంది మిసెస్ కైలాసం.

"చెప్పండి, ఆఫీసు ఎలా వుంది?" ఏదో అడగాలి కాబట్టి అడిగాడు ఆఫీసరు.

అలోచిస్తున్న మిసెస్ కైలాసం ఉలిక్కిపడింది. తననే ఆ ప్రశ్న వేసింది? తననే! ఇంకెవరూ ఆ గదిలో లేనిదే? ఎంతమంచివాడు? తనకెంత గౌరవాన్ని ఇస్తున్నాడు? ఆఫీసు ఎలా ఉందని తననే ప్రశ్నిస్తున్నాడు! చాలా తెలివైన కుర్రాడు అనుకుంది మిసెస్ కైలాసం.

ఆ ప్రశ్నకోసమే ఎదురు చూస్తున్నట్లు గబ గబా ఆ ఆఫీసులో వాళ్ళు ఎంత చెడ్డవాళ్ళో చెప్పేసి తేలిగ్గా గాలి పీల్చుకుంది. ఆఫీసరు ఆశ్చర్యంగానే ఆమె మాటలు వింటూ గంభీరంగా చూస్తున్నాడు.

"ఆ జానకి అనే ఆవిడకు అంత గర్వమా అండీ?" అడిగాడు ఆఫీసరు.

"చిన్నగా అడుగుతారేం? మీరు ఆమె గర్వాన్ని అణచాలి. ఆఫీసర్లను ఎలా గౌరవించాలో నేర్పించాలి" అంది.

"నా దగ్గర అలాటివి సాగవులెండి!" అన్నాడు ఏదో ఆలోచిస్తూ.

"సర్! ఒక మనవి. నేను రోజూ నాలుగున్నరకే వెళ్ళిపోతాను. ఇంతకుముందువున్న ఆఫీసరమ్మగారు నాకు పర్మిషన్ ఇచ్చారు. ఉదయం కూడా ఒక గంట ఆలస్యంగానే వస్తాను" అంది మిసెస్ కైలాసం తల వంచుకొని ముసిముసిగా నవ్వుతూ.

ఆఫీసరు ఆమెనూ, ఆమె సిగ్గునూ కళ్ళు పెద్దవి చేసుకొని చూశాడు. అతని మౌనాన్ని అంగీకారంగా తీసుకుంది.

"సర్! ఆ జానకి గవర్నమెంటుకు నాతో సమానం అయిన ఉద్యోగం కావాలని అప్లికేషన్‌కూడా పెట్టుకుంది. ఎంత ధైర్యమో ఆలోచించండి!" అంది మిసెస్ కైలాసం.

ఆఫీసరు అర్థం కానట్లు చూశాడు మిసెస్ కైలాసం ముఖంలోకి. పెద్ద ఉద్యోగం కావాలని కోరటం నేరం అని యింతకుముందెప్పుడూ అతని బుర్రలోకి రాలేదు.

"వెళ్ళొస్తానండీ!" అంది.

"అలాగే, వెళ్ళిరండి" అన్నాడు ఆఫీసరు ఆమెను అదోలాచూస్తూ.

"ఆఫీసరు మంచివాడే! కాని మనవాళ్ళు చెడగొట్టకుండా ఉండాలిగా!" అనుకుంటూ బయటకు వచ్చింది మిసెస్ కైలాసం.

కొన్ని నెలలు గడిచాయి. మిసెస్ కైలాసం భయాలన్నీ తీరిపోయాయి. రోజూ ఒక గంటయినా కూర్చొని ఆఫీసు విషయాలు విన్నవించుకుంటూ వుంటుంది.

ఒకరోజు ఆఫీసరు పిలుస్తున్నాడనగానే ఆగమేఘాలమీద వాలిపోయింది ఆఫీసరు గదిలో.

నవ్వుతూ 'పిలిచారా?' అతిమృదువుగా అడిగింది. అంత పెద్దావిడ అంత మృదువుగా మాట్లాడినప్పుడు ఆఫీసరుకు అదోలా అనిపించి చిరాకు వేసేది.

"కూర్చోండి. మీకో ముఖ్యవిషయం చెప్పాలి" అన్నాడు ఆఫీసరు.

ముఖ్యవిషయం! తనతోనే చెప్పాలట! తనకంటే సీనియర్ ఆఫీసర్లు వుండగా

అంత ముఖ్య విషయం తనతోనే చెప్పాలంటున్నాడు. ఎంత మంచివాడు!

"సర్!" వణుకుతున్న స్వరంతో కృతజ్ఞత ఉట్టిపడుతూ అంది.

"చూడండి! గవర్నమెంటునుంచి ఎకానమీ మెజర్స్ అబ్జర్వ్ చెయ్యాలని ఇన్స్ట్రక్షన్స్ వచ్చాయి. పది పర్సెంటు కట్ చూపించాలి."

ఆఫీసరు అందించిన కాగితం చూస్తూనే మిసెస్ కైలాసం ముఖం ఆనందభరితం అయింది.

"సమయానికి వచ్చింది సర్! పనికిమాలినవాళ్ళు చాలామంది వున్నారు" అంది ఉత్సాహంగా.

"పనికిమాలినవాళ్ళను గురించి కాదు, పనిలేనివాళ్ళను గురించి ఇప్పుడు ఆలోచించాల్సింది" అన్నాడు ఆఫీసరు కొంచెం విసుగ్గా.

తను అన్నదానికీ, ఆఫీసరు అన్నదానికీ తేడా యేమిటో మిసెస్ కైలాసానికి వెంటనే బుర్రకు ఎక్కలేదు. అదేదో జోక్ అనుకొని పకపక నవ్వింది. ఆఫీసరు తెల్లబోయి చూశాడు.

"అవును సర్! ఆ రకం, ఈ రకం రెండు రకాల వాళ్ళూ వున్నారు సర్!" మళ్ళీ విరగబడి నవ్వింది.

ఆఫీసరు ముఖం చిట్లించుకోవటం చూసి సర్దుకుని కూర్చుంది మిసెస్ కైలాసం.

"ఇంతకీ మీ అభిప్రాయం ఏమిటి?"

మిసెస్ కైలాసం సీరియస్‌గా ఆలోచిస్తున్న ముఖంపెట్టింది. ఆమె మెదడులో "జానకి" ఇంకా కొందరు గిరగిరా తిరుగుతున్నారు.

"మనకున్న ఎనిమిది సెక్షన్లలో రెండింటికి పూర్తిగా పనిలేదు. అవి రెండూ ఎత్తేస్తే సరిపోతుంది సర్!"

"పూర్తిగా రెండు సెక్షన్లు ఎత్తేయాల్సిందేనంటారా?" సాలోచనగా అడిగాడు ఆఫీసరు.

"సందేహమెందుకు సర్! ఆ రెండు సెక్షన్లు చూస్తూంది నేనేగా?" అంది కైలాసం.

"అయితే సరే! అలాగే రాసి పంపించండి. గవర్నమెంటుకు రాసేద్దాం!" అన్నాడు ఆఫీసరు.

మిసెస్ కైలాసానికి డిన్నర్ పార్టీకి వెళ్ళి వచ్చినట్లనిపించింది తృప్తిగా. తనకు ప్రమోషన్ వచ్చినరోజు ఉన్నంత సంతోషంగా వుంది- అనుకుంది. సెక్షన్లలోకి ఓసారి గర్వంగా అందరి ముఖాల్లోకి చూస్తూ తనలో తనే నవ్వుకుంది.

"అందరి తిక్కా కుదురుతుందిలే!" అన్నట్లుంది ఆమె నవ్వు.

మిసెస్ కైలాసం ఎదురుచూస్తున్న ముహూర్తం రానే వచ్చింది. ఆఫీసరు ఆమెను పిలిచి గవర్నమెంటు ఆర్డర్లు అందించాడు. ఆత్రంగా చదివింది. అనుకున్నట్లు రెండు సెక్షన్లు పోయాయి. ఆ సమయంలో జానకి ముఖం చూడాలనే కోరిక తన్నుకొచ్చింది ఆమెలో.

"జానకిని పిల్చి వెంటనే పుటప్ చేయిస్తాను సర్!" అంది వుత్సాహంగా.

ఆఫీసర్ తల ఆడించారు-ఆమెవైపు జాలిగా చూస్తూ, జానకి వచ్చి ఆఫీసరుకు వినయంగా నమస్కరించింది. "సారీ జానకీ! పదిమందిదాకా మన ఆఫీసులో రిట్రెంచ్ అవుతారు. ఆర్డర్సు వచ్చాయి. నీక్కూడా రివర్షన్ వస్తుందనుకుంటాను." సానుభూతి ఉట్టిపడే స్వరంలో అంది మిసెస్ కైలాసం. కాని ఆమె స్వరంలోని హేళన జానకికేకాదు;

ఆఫీసరుకుకూడా వినిపించింది.

"పదిమందితో నాకూ రివర్షన్ వస్తుంది, అంతేగా?" తాపీగా తొణక్కుండా అంది జానకి.

ఆఫీసరు జానకిని కూర్చోమన్నాడు. జానకి కూర్చుంది. మిసెస్ కైలాసానికి మతిపోయినట్టయింది. "ఏమిటి ఈవిడ ధీమా! రివర్షన్ వస్తున్నా ఖాతరు లేనట్టే మాట్లాడుతుంది" అనుకుంది. "మీరంతా కష్టపడి పనిచేస్తే ఈ కర్మ పట్టేదికాదుగా!" జానకిని బల్లెంతో పొడిచి పైకెత్తటానికి వీల్లేదు కనుక అలా అంది.

సమాధానంగా జానకి కైలాసంకేసి తిరిగి చిరునవ్వుతో, "గాడిదా చేస్తుంది చాకిరి, కాని దానికి బుద్ధిలేదుగా?" అంది.

మిసెస్ కైలాసానికి అర్థం కాలేదు; కోపంతో అంది: "అలాంటి మాటలు ఆఫీసర్లముందు మాట్టాడకూడదు. మోస్టు ఇన్‌డిసిప్లిన్" అంటూ ఆఫీసరు ముఖంలోకి చూసింది.

"యస్ యస్! యూ ఆర్ కరెక్టు!" అన్నాడు ఆఫీసరు. కాని అతని ముఖంలో, స్వరంలో ఎలాంటి భావమూ స్ఫురించలేదు.

"చూడమ్మా! ఆ పేపరు వెంటనే పుటప్ చేసేయ్" అన్నాడు జానకితో.

"అలాగే సర్!" అంటూ మిసెస్ కైలాసం చేతిలోని పేపర్ని అందుకుంది జానకి. మిసెస్ కైలాసం జానకి ముఖంలోకి చూస్తూ కూర్చుంది.

జానకి రిట్రెంచ్‌మెంట్ ఆర్డరు ముందు పేజీ చదివి రెండోపేజీ తిప్పింది. ఆశ్చర్యంగా ఓ క్షణం ఆమె ముఖంలోకి చూసి "సారీ, మిసెస్ కైలాసం!" అంది జానకి.

"మిసెస్ కైలాసం!" ఉలిక్కిపడింది మిసెస్ కైలాసం. ఎంత పొగరు! ఏదో అనబోయి ముందుపెట్టిన కాగితం చూసిన మిసెస్ కైలాసం నోరు తెరిచే ఉండిపోయింది. మనిషి కొయ్యబారిపోయింది.

సెక్షన్స్ పోయాయనే ఆనందంతో ఆర్డరు కాగితాన్ని తిప్పి చూడటానికికూడా తీరిక లేకపోయింది మిసెస్ కైలాసానికి.

మిసెస్ కైలాసం చేస్తున్న గజెటెడ్ పోస్టుపై గొడ్డలి దెబ్బ తగిలింది. రెండు సెక్షన్లతోపాటు వాటికి సంబంధించిన ఆఫీసరు పోస్టుకూడా పోయింది.

గజెటెడ్‌నుంచి ఎన్.జీ.ఓ.గా మళ్ళీ మారిన మిసెస్ కైలాసం ఏమయిందీ, ఏం చేసిందీ తెలుసుకోకపోవటమే మంచిది.

('68 వాణిశ్రీ మాసపత్రిక)